క్లుప్తంగా

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు


ఎమ్మెల్యే కృష్ణారావు


పీఏసీ చైర్మన్ గాంధీ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ మంగళవారం నియోజకవర్గ ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరూ నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. నూతన సంవత్సరం మీ జీవితంలో వెలుగులు నింపాలన్నారు.

అధ్వానంగా వసతి గృహాలు

కూకట్‌పల్లి: రాష్ట్రంలో వసతి గృహాలు, గురుకులాలు అధ్వానంగా మారాయని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆయుష్ అన్నారు. మంగళవారం కేపీహెచ్‌బీ నగర శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు కారాగారాల కంటే దారుణంగా ఉన్నాయన్నారు. అనేక మంది విద్యార్థులు పాముకాటు, ఫుడ్ పాయిజన్, అధికారుల వేధింపులతో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో కేపీహెచ్‌బీ నగర కార్యదర్శి ఆకాష్ పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా హరిప్రసాద్


జీడిమడ్ల హరిప్రసాద్

బాలానగర్: బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జీడిమడ్ల హరిప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సెవెల్ల మహేందర్ చేతుల మీదుగా మంగళవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో జరిగే అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటానని, పార్టీ బలోపేతానికి అంకిత భావంతో పనిచేస్తానని అన్నారు.

ఆంగ్ల సంవత్సర కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న బండి రమేష్ తదితరులు

మూసాపేట: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ చేతుల మీదుగా మంగళవారం యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ సలీం ఆధ్వర్యంలో 2025 కేలండర్‌ను ఆవిష్కరించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, యూత్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ.. సన్మానం


సన్మానిస్తున్న డీఎంహెచ్‌ఓ, వైద్యులు

బాలానగర్: ఉద్యోగ విరమణ అనేది వయస్సుకే కాని మనస్సుకు కాదని మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి. రఘునాథ్ స్వామి అన్నారు. బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సూపర్ వైజర్‌గా విధులు నిర్వహించిన విక్టోరియా మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా విక్టోరియా మాట్లాడుతూ.. తన ఉద్యోగ జీవితం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని అన్నారు. అనంతరం దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో బాలానగర్ ఆరోగ్య కేంద్రం వైద్యులు వినోద్, మల్లీశ్వరి, సరస్వతి, సిబ్బంది ప్రకాష్, రవి ప్రకాష్, నారాయణ పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ప్రభుత్వ కళాశాల విద్యార్థి

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 30న నగరంలోని జింఖానా గ్రౌండ్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కళాశాలకు చెందిన కె.నాగరాజు జావెలిన్ త్రోలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించాడు. జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగే ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి అండర్-19 పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు.

ఉపాధి ప్రణాళికపై కసరత్తు

2025-26 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం

- ఉపాధి పనుల్లో చెరువు పూడిక తీత, ఫీడర్ కాలువలు, కందకాల తవ్వకాలు
- వన మహోత్సవంలో మొక్కలు నాటేందుకు గుంతలకు అధిక ప్రాధాన్యం



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్- మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో (మేటీరియల్ కాంపోండ్‌తో కలిపి) అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి సంస్థలు (డీఆర్డీఏ)కసరత్తు చేస్తున్నాయి. వచ్చే ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు ఉపాధి కూలీలు చేపట్టనున్న పనులకు సంబంధించిన కార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించారు. శివారు జిల్లాల్లో 1,78,867 మంది కూలీలకు 11.83 లక్షల పని దినాల్లో రూ. 27.95 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులు చేపట్టాలన్న లక్ష్యాన్ని అధిగమించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 17,832 మంది కూలీలకు 1.71 లక్షల పని దినాల్లో రూ.5.30 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనుల నిర్వాహణకు చర్యలు తీసుకుంటున్నారు. కూలీలకు వంద రోజులు పనిని కల్పించటం ద్వారా పేదల జీవనోపాధిని మెరుగు పరిచేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. నగర శివారు జిల్లాల్లో మొత్తంగా 620 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇటీవల సర్కారు 40 గ్రామ పంచాయతీలను సమీపంలోని 11 పురపాలక సంఘాల్లో విలీనం చేసిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న 580 గ్రామ పంచాయతీల్లోనే ఉపాధి హామీ పనులు జరిగేలా ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి సంస్థలు కార్యాచరణ కార్యక్రమాన్ని ఖరారు చేస్తున్నాయి.

పనులిలా

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు మేడ్చల్ జిల్లాలో 2,369 మంది కూలీలకు 37,631 పని దినాలను కల్పించటం ద్వారా సామగ్రితో కలిపి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ అభివృద్ధి పనుల విలువ రూ.4 కోట్ల వరకు ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రతి రోజూ 127 నుంచి 282 మంది కూలీలు ఉపాధి పనుల్లో నిమగ్నమై పని చేస్తున్నారు.
- రంగారెడ్డి జిల్లాలో కూడా ఇప్పటి వరకు ఉపాధి కూలీలకు 10.12 లక్షల పని దినాలను కల్పించిన డీఆర్‌డీఏ రూ.22.64 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొంటోంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువు పూడికతీత పనులతో పాటు కందకాలు తవ్వటం, కాలువల నిర్మాణం, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడానికి గుంతలు తవ్వటం వంటి పనులను కూలీలు చేపట్టారు.



ఉపాధి హామీలో గుర్తించిన పనులివే ..

ఉపాధి హామీ పథకంలో భాగంగా నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు ప్రక్రియను అధికార యంత్రాంగం ప్రారంభించింది. ఉపాధి పనుల్లో భాగంగా ఊట కుంటలు, కందకాలు తవ్వటం, ప్రభుత్వ స్థలంలో మొక్కలు పెంచటం, పల్లె ప్రకృతివనాలు, రైతు కళ్లాలు, ప్రభుత్వ స్థలంలో నేలను చదును చేయటం, ఎండిపోయిన బోరుబావుల రీచార్జి, వైకుంఠ ధామాలు, ప్రభుత్వ సంస్థలకు రోడ్లు వేయటం, డంపింగ్ యార్డులు, కామన్ ల్యాండ్ సోక్ పిట్స్, కొత్తగా నిర్మించిన రహదారులపై గ్రావెల్ వేయటం, కంపోస్ట్ ఎరువుల గుంతలు, ఫీడర్ కాలువలు వంటి పనులను కూలీలు చేపట్టనున్నారు. అలాగే పశువులు, గొర్రెలు, మేకలు, పండ్ల తోటల నిర్మాణం, తాటి వనాలు పెంచటం, చేపల కుంటలు, మిషన్ భగీరథ కోసం కందకాలు, మైనర్ ఇరిగేషన్ కాలువల్లో పూడిక తీయటం, వన మహోత్సవంలో మొక్కలు నాటేందుకు గుంతలు తీయటం వంటి ఉపాధి పనులు కూడా కూలీలు చేపట్టనున్నారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం పలు దేవాలయాలను దర్శించి పూజలు నిర్వహించారు. బాలాజీనగర్ డివిజన్, ఆంజనేయ నగర్‌లోని వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ప్రగతినగర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేలండర్‌ను ఆవిష్కరించారు. అదే విధంగా కూకట్‌పల్లిలోని చిత్తారమ్మ, అయ్యప్ప స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, అంబటి శ్రీనివాస్, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, వినోద్, అయ్యప్పస్వామి మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న రవికుమార్ యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: పేదరికంలో ఉండి చదువుకోలేని వారికి సందయ్య మెమోరియల్ ట్రస్ట్ అండగా నిలుస్తున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ శంషీగూడ, ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలల్లో సందయ్య మెమోరియల్ ట్రస్ట్, ఆర్.కే.వై. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 350 మందికి పైగా 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నామని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే మోడల్ పేపర్ తయారు చేయించామన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, నర్సింగ్ యాదవ్, నరసింహ చారి, కుమార్ యాదవ్, వెంకటస్వామి, యాదవరెడ్డి, సత్యనారాయణ యాదవ్, స్రవంతి, డాక్టర్ వంశీరాయల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను పూర్తి చేయిస్తా

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ


సమస్యలు తెలుసుకుంటున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో అసంపూర్తి పనులను పూర్తి చేయిస్తానని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. మంగళవారం మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, జలమండలి విభాగాల అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. మౌలిక వసతులు కల్పించినందుకు ఎమ్మెల్యేకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, సీసీ రోడ్లు వేయాలని, మంచినీటి వ్యవస్థను మెరుగుపర్చాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో త్వరలో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. యూజీడీ నిర్మాణ పనులు చేపడుతున్నామని, డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యను త్వరలోనే పరిష్కరించి శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నాగప్రియ, మేనేజర్ ప్రశాంతి, జీహెచ్ఎంసీ ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌బీఎన్‌కేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్


సభ్యత్వ నమోదు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కుమ్మరి వెంకటేష్

మోతీనగర్: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌బీఎన్‌కేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కరపత్రాన్ని స్థానిక కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సంఘంలో, ఇతర సంక్షేమ బోర్డులో పేరు నమోదు చేసుకొని పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా గుర్తింపు కార్డు పొంది 50 సంవత్సరాలు నిండిన వారికి నెలకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు ఇంటి స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అడ్డాల వద్ద మూత్రశాలలు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు నిర్మించాలన్నారు. సమావేశంలో ఎస్. వెంకటేష్, సూర్యనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామికి 18 కలశాల నీటిని అభిషేకిస్తున్న అరుణ్ గురుస్వామి



పడిపూజలో ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు



నయనానందకరంగా 18 కలశాల మహా పడిపూజ

కూకట్‌పల్లి: వివేకానందనగర్ కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి, యామిని దంపతుల ఆధ్వర్యంలో అరుణ్ గురుస్వామి కరకమలములచే శబరిమలను తలపించేలా వేడుకలను నయనానందకరంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు మావుడూరి యోగీశ్వర శర్మ వేదమంత్రాల సాక్షిగా శివ కిరణ్ శర్మల పర్యవేక్షణలో రాజశ్యామల మహాయాగం, శివపార్వతుల కల్యాణం, 18 కలశాల మహాపడిపూజ జరిగింది. లక్ష్మీగణపతి హోమం, స్వామివారి పల్లకీ సేవ ఘనంగా జరిగింది. అనంతరం స్వామివారి అన్న ప్రసాదం వితరణ జరిపారు. శ్రీ సాయి అయ్యప్ప భజన బృందం రాజు స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి భజన, పాటలకు భక్తులు నృత్యాలు చేసి పులకరించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని స్వామివారి మూల విరాట్‌కు పుష్పాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరయ్యారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త కొండల్‌రావు, బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, కార్పొరేటర్‌లు మాధవరం రోజాదేవి రంగారావు, దొడ్ల వెంకటేష్‌గౌడ్, పార్టీల నాయకులు పాల్గొన్నారు.



యువత మేలుకో... మత్తు వదులుకో



ర్యాలీలో మాధవరం కాంతారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలో స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 'యువత మేలుకో.. మత్తు వదులుకో' అనే నినాదంతో డ్రగ్స్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి స్వచ్ఛ అభియాన్ సంస్థ నిర్వాహకులు మాధవరం కాంతారావు, కూకట్‌పల్లి ఏసీపీ, సెక్టార్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందుగా కేపీహెచ్‌బీలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రజలతో డ్రగ్స్ నివారణపై అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు.

ఘనంగా కార్పొరేటర్ జన్మదిన వేడుకలు


కార్పొరేటర్ నరసింహ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సన్మానిస్తున్న కార్యకర్తలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు ఏసు గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఓల్డ్ బోయిన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు అందజేశారు. అనంతరం అంజయ్య నగర్ రిటైల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మక్కాల సత్యనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మల్లేష్ యాదవ్, సయ్యద్ ఎజాజ్, ఇర్ఫాన్, గడ్డం నర్సింగరావు, కర్రి జంగయ్య, బాలరాజ్, శ్రీనివాస్ రెడ్డి, ఉదయ్‌యాదవ్, వీరస్వామి, నగేష్, సాయి, గణేష్, లలిత తదితరులు పాల్గొన్నారు.



న్యూఎరా పాఠశాలలో రంగోలి పోటీలు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని న్యూఎరా పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థుల మాతృమూర్తులకు 'కుకింగ్ వితవుట్ ఫైర్', రంగోలి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థుల మాతృమూర్తులు ఉత్సాహంగా పాల్గొని పౌష్టికాహార పదార్థాలను తయారు చేశారు. ఆకట్టుకునే విధంగా ముగ్గులు వేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి భారత్ వికాస్ సంస్థ నిర్వాహకురాలు చింతపల్లి చైతన్య బహుమతి ప్రదానం చేశారు. మారుతి డెవలపర్స్ అధినేత రేణుక, చింతపల్లి చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో న్యూఎరా ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి అపర్ణ, న్యూఎరా కళాశాల డైరెక్టర్ వంశీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



